స్వతంత్ర పోరాటంలో గాంధీ పాత్ర మరువలేనిది



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ నాయకులు

రసూల్‌పురా: దేశ స్వాతంత్ర పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీ పాత్ర మరువలేనిదని అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా కృషి చేసిన మహనీయుడని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటీహాల్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవితచరిత్ర సినిమాను ప్రదర్శించారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై సినిమా ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హైదర్, సందీప్, ప్రదీప్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



రసూల్‌పురా: తెలంగాణ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్లు విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ పీజీ కళాశాలలో స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడి విద్యార్థులు ప్రాణత్యాగాలు చేసి తెలంగాణ సాధించుకున్నా విద్యార్థుల భవిష్యత్తు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉందని బాలు పేర్కొన్నారు. ప్రభుత్వం మారినా విద్యశాఖ అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడు లేడని అన్నారు. కార్యక్రమంలో నగర ఎస్ఎఫ్‌డి కన్వీనర్ పాండురంగా, బేగంపేట టౌన్ సెక్రటరీ అభినయ, జాయింట్ సెక్రటరీ రాము, విద్యార్థి నాయకులు దుర్గేష్, కృష్ణ అజయ్, మహేష్, మురారి, రోహిత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిలకలగూడ: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బంగారు భవితకు బాటలు వేయాలని వరల్డ్ విజన్ ఇండియా సంస్థ అసోషియేట్ డైరక్టర్ శాంసన్ బంటు అన్నారు. చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో గురువారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్కూలుబ్యాగులు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ప్రోగ్రామ్ మేనేజన్ పీవీ కృష్ణ, పాఠశాల హెచ్ఎం మల్లిఖార్జునరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోండి



సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో ఇన్వెస్టిచ్యూర్ సెర్మనీ (నాయకత్వ బాధ్యత స్వీకరణ కార్యక్రమం) గురువారం సందడిగా జరిగింది. పాఠశాలలో పలు గ్రూపులకు చెందిన విద్యార్థులకు నాయకత్వ బాధ్యతలను అప్పగించారు. వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రూపులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. వారి నుంచి ముఖ్యఅతిథి గౌరవ వందనం స్వీకరించారు. ట్రస్ట్ ప్రతినిధులు త్రిపాఠి, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు

రాంగోపాల్‌పేట్: గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు బుధవారం మధ్యాహ్నం డ్రంకన్ డ్రైవ్‌ను నిర్వహించారు. గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురు పట్టుబడ్డారు. ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌తో పాటు ఎస్సైలు సతీష్ తదితరులు డ్రంకన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

మందుబాబులకు పట్టపగలే చుక్కలు

మందు తాగి వాహనం నడిపితే అంతేసంగతులు

- రెండు రోజుల్లో 153 కేసులు నమోదు
- వాహనాలు వదిలి పరారవుతున్న వైనం
- లష్కర్‌లో రోజంతా మద్యం పరీక్షలు

సికింద్రాబాద్: మందుబాబులకు ట్రాఫిక్ పోలీసులు రెండు రోజులుగా పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. రాత్రి సమయాల్లో మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ఉంటాయి, మహా అయితే సాయంత్రం సమయాల్లో ఉంటాయి అనుకుని ఇక మీదట మద్యం సేవించి వాహనాల మీద తిరిగితే కేసులు, జైలు పాలవడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రత్యేకమైన ప్రాం నగరంలో రాత్రి సమయం కంటే పగటి సమయాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దాదాపు ఎక్కువ ఈ తరహా ప్రమాదాల్లో వాహనాలు నడిపేవారు మద్యంసేవించి ఉంటున్న కారణంగా ట్రాఫిక్ పోలీసులు తమ పంథా మార్చారు. నిర్ణీత వేళలు అంటూ ఏమి లేకుండా నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలమేరకు కొద్ది రోజులుగా సికింద్రాబాద్ రహదారులపై మద్యం సేవించి వాహనాలు నడిపే వ్యక్తులపై ఉక్కుపాదం మోపుతున్నారు. పగటి వేళల్లో తొలుత స్కూలు బస్సులు, భారీ వాహనాలపై పరీక్షలుకు సిద్ధమైన ట్రాఫిక్ పోలసులు రెండు రోజులుగా అన్ని రకాల వాహనాలను నిలిపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 16, 17 తేదీల్లో రెండు రోజులు సికింద్రాబాద్ ప్రాంతంలోని ఆరు ట్రాఫిక్ పోలీసులు పగలు నిర్వహించిన తనిఖీల్లో 153 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

తాలు, రాత్రి పగలు అంటూ ఏమీ లేదు... వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

వాహనాలు వదిలి పరుగులు....

ట్రాఫిక్ పోలీసులు ఏ రోడ్డులో వాహనదారులకు మద్యం పరీక్షలు నిర్వహిస్తారో బ్రీత్ ఎనలైజర్ బయటికి తీసే వరకు తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. సిగ్నల్ దగ్గర వాహనాలు నిలిపిన సమయంలోనూ అనుమానిత వ్యక్తుల వాహనాల వద్దకు వెళుతున్న ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో లోగడ నిర్దేశిత ప్రధాన రహదారుల్లోనే గుంపుగా మోహరించిన ట్రాఫిక్ పోలీసులు ఈ పరీక్షలు నిర్వహించే వారు. ఇప్పుడు అక్కడ ఇక్కడ అంటూ ఏం లేదు.. ప్రధాన, ఇంటర్నల్ తేడా లేదు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే అన్ని ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇది గమనిస్తున్న మరికొందరు వాహన దారులు వెనక్కి తిరిగి వెళ్లే మార్గం లేక వాహనాలు అక్కడే వదిలేసి ఉడాయిస్తున్నారు. రెండు రోజుల్లో 23 మంది వాహనదారులు మద్యం పరీక్షలకు చిక్కకుండా ఉండేందుకు వాహనాలు వదిలి పలాయనం చిత్తగించారు.

ప్రమాదాల నివారణ లక్ష్యంగా...





పద్మారావునగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు

పర్మిట్ రూంలలో తగ్గిన రద్దీ

మద్యం తాగితే ఇంట్లో తాగండి లేదంటే జైలుకు వెళ్లడం ఖాయం అంటూ మద్యం తాగి వాహనాలు నడిపే వ్యక్తులను ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వరకువాహన చోదకులు ట్రాఫిక్ పోలీసులు కనబడితే పెండింగ్ చలాన్లకు భయపడేవారు. ఇప్పుడు వాహనదారులు నిరంతర మద్యం తనిఖీలకు బెంబేలెత్తి పోతున్నారు. ఇటువంటి పరిణామాల నేపథ్యంలో తాగడం, వాహనాలు నడుపడం, పోలీసులకు పట్టుడబబడం కంటే మద్యానికి పగలు దూరంగా ఉండడం మంచిదన్న అభిప్రాయం పలువురు వాహన దారుల్లో వ్యక్తం అవుతుంది. మద్యం సేవించి వాహనాన్ని నడిపి పట్టుబడితే కేసు నుంచి బయటకు రావడం, వాహనాన్ని విడుదల చేసుకోవడం కోసం కౌన్సిలింగ్, కోర్టు, జరిమానా తదితర తతంగాలు ఉన్న క్రమంలో వాహనచోదకులు మద్యం దుకాణాలను ఆశ్రయించడం లేదు. ఫలితంగా ఎప్పుడు బయట వాహనాలు, లోపల మద్యం సేవించే వారంతో సందడిగా ఉండే పర్మిట్ రూమ్‌లు కాసింత బోసిబోయి కనిపిస్తున్నాయి.

నిరంతర పరీక్షలు ఉంటాయి



ఇక మీదట అన్ని వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తాం. అక్కడ ఇక్కడ అంటూ ఏం ఉండదు. ట్రాఫిక్ విధులు నిర్వహించే ప్రాంతాల పోలీసుల వద్ద బ్రీత్ ఎనలైజర్లు ఉంచుతున్నాం. ప్రయాణికుల సంరక్షణ కోసం మాత్రమే నగర పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలకు ఉపక్రమించాం. వాహనాలు నడిపే సమయంలో మద్యానికి దూరంగా ఉండడం మంచిది.

– సీహెచ్ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చిలకలగూడ

రేపు ఓయూలో బీసీల ధూంధాం

ఉస్మానియా యూనివర్సిటీ: రేపు (19న) ఓయూలో బీసీల ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు మహేష్‌గౌడ్ గురువారం తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకోసం వర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జరిగే ధూంధాం కార్యక్రమానికి విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి



జలమండలి అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు టి. రాజశేఖరరెడ్డి, హరినాథ్ నాయి, సురేష్, అంగముత్తు శ్రీనివాస్, తదితరులు కలిసి జలమండలి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. డివిజన్‌లో అనేక ప్రాంతాల్లో ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్ వల్ల డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయన్నారు. దేవీనగర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యతో స్థానికులు పలు ఇక్కట్లకు లోనవుతున్నారని వివరించారు.

మల్టీపర్పస్ హాలు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

అడ్డగుట్ట: అర్ధాంతరంగా నిలిచిపోయిన అడ్డగుట్ట మల్టీపర్పస్ హాలు నిర్మాణ పనులను వెంటనే పునః ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మల్టీపర్పస్ హాలు నిర్మాణ ప్రాంగణంలో సీపీఎం నేతలు ఆందోళన చేశారు. సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఆర్. మల్లేష్ మాట్లాడుతూ అడ్డగుట్టలో మల్టీపర్పస్ హాలు నిర్మాణానికి 2020లో శంకుస్థాపన చేశారన్నారు. కేవలం రెండు ఫ్లోర్లు స్లాబ్ వేసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా అలాగే వదిలేయడంతో అక్కడ పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. మంచిగా ఉన్నటువంటి కమ్యూనిటీ హాలును కూల్చి వేసి ఐదేళ్లుగా స్థానికులకు హాలును అందుబాటులో లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు అజయ్ బాబు, ఎల్లయ్య, అంజమ్మ, రాపర్తి ప్రభాకర్, బాలయ్య, శంకర్, జగన్, కుమార్, ఫాతిమా తదిరులు పాల్గొన్నారు.

వర్సిటీల అధ్యాపక పోస్టుల భర్తీని వేగవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలలో అధ్యాపకుల పోస్టుల భర్తీని వేగవంతం చేయాలని తెలంగాణ డాక్టరేట్ అసోసియేషన్ (టీజీడీఏ) రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పార్ట్ టైం అధ్యాపకుడు డా.పెద్దిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొక్కుబడిగా 500 పోస్టులు కాకుండా వర్సిటీలలో ఖాళీగా ఉన్న 3000 అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డితో పాటు ఇతర అధికారులకు వినతి పత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. గత 13 ఏండ్లుగా అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేయనందున బోధన, పరిశోధనకు అధ్యాపకుల కొరత ఏర్పడిందన్నారు. కొన్ని వర్సిటీలలో అధ్యాపకులు పూర్తిగా లేనందున విభాగాలను మూసివేసినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో టీజీడీఏ నేతలు డా.రమణరావు, డా.తిరుపతి, డా.మహేందర్, రాజేష్, డా.స్వామినాయక్, డా.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిప్‌అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చిలకలగూడ : సిప్‌అబాకస్ రీజనల్ ప్రొడిజీ పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి పలు బహుమతులు గెలుచుకున్నారని పద్మారావునగర్ ఫ్రాంచైజీ నిర్వాహకురాలు అనురాధ రజనీకాంత్ తెలిపారు. గురువారం పద్మారావునగర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. సిప్ అబాకస్ రీజనల్ ప్రొడిజీ–2025 పేరిట ఇటీవల కాంపిటీషన్ నిర్వహించగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలు సెంటర్ల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పద్మారావునగర్ సెంటర్ విద్యార్థులు పలు మెడల్స్, ట్రోఫీలను గెలుచుకున్నారు. కార్యక్రమంలో సుచరిత, కవిత, విద్య, సంఘమిత్రల తోపాటు విద్యార్థులు, తల్లితండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జోరు వర్షానికి జలమయమైన బస్తీలు

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో గురువారం జోరు వాన కురిసింది. ఈ వర్షంతో నగర జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కార్యాలయాల నుంచి, వివిధ పనుల నుంచి ఇండ్లల్లోకి వెళ్లే వారు, ద్విచక్ర వాహనదారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు తడిసి ముద్దయ్యారు. తార్నాక, లాలాపేట, సత్యానగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో కాలనీ, బస్తీ మ్యాన్ హోళ్లు, డ్రైనేజీ నాలాలు పొంగి అంతర్గత రోడ్లపై వర్షం నీరు నిలిచింది. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి ట్రాఫిక్ జాం అయింది.


కంటోన్మెంట్‌లో వివాదాస్పద ఫ్లెక్సీ



కంటోన్మెంట్: పికెట్ గార్డెన్స్‌లో ఓ వివాదాస్పద ఫ్లెక్సీ కలకలం సృష్టించింది. ‘ఏ టూ జెడ్ గవర్నెన్స్ ఆఫ్ సీఎం రేవంత్ పేరిట అజ్ఞాత వ్యక్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గురువారం వేకువజామునే ఈ ఫ్లెక్సీని గుర్తించిన అధికారులు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సహకారంతో తొలగించారు. గురువారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఓ కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు హోరింగ్‌పై ఫ్లెక్సీని వేలాడదీసినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పింఛన్ ఇప్పించండి

ఓయూ ప్రొఫెసర్ అన్సారీ



ప్రొ.అన్సారీ

ఉస్మానియా యూనివర్సిటీ: తనకు రావలసిన పింఛన్‌ను, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇప్పించాలని విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ ఓయూ వీసీ ప్రొ.కుమార్‌ను కోరారు. గురువారం పాలనా భవనం కార్యాలయంలోకి వస్తుండగా సెక్యూరిటీ గార్డులు అడ్డుకొని గేట్లు మూసివేయడం పట్ల తీవ్రమనస్థాపం చెందారు. రిటైర్డ్ అయి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఓయూ అధికారులు కాలయాపన చేయడం దారుణమన్నారు.

ముగిసిన సీపీగేట్ దరఖాస్తుల స్వీకరణ

రూ.2000 అపరాధ రుసుముతో 28 వరకు గడువు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సీపీజీఈటీ–2025 (సీపీగేట్) దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగిసింది. గత నెల 18న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు 55 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. రూ.500 అపరాధ రుసముతో ఈ నెల 24 వరకు, రూ.2000 అపరాధ రుసుముతో 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆగస్టు 4 నుంచి ప్రారంభమగు పీజీ ప్రవేశ పరీక్షలకు వారం రోజుల ముందు నుంచి హాల్‌టిక్కెట్లను జారీ చేయనున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది కంటే సుమారు 15 వేల దరఖాస్తులు తగినట్లు సమాచారం. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వచ్చే వర్షకాల సమావేశాల్లో బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి అమలు చేయాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీసీఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఓయూలో విద్యార్థి నేతలు మాట్లాడుతూ తెలంగాణ బీజేపీ ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి 42 శాతం రిజర్వేషన్లను ఆమోదింప చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చే బాధ్యతను విధిగా తీసుకోవాలని కోరారు. బీసీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మబోయిన సైదలు, మాదిగ నవ నిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి నగేష్ పాల్గొన్నారు.

సింగరేణి మాజీ ఉద్యోగి పై పోలీసులకు ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: సింగరేణి సీఎండీ బలరాం నాయక్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఉద్యోగి జీకే సంపత్ కుమార్ పై ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లంబాడీల ఐక్యవేదిక విద్యార్థి నాయకుడు రాజేష్ చౌహాన్ గురువారం తెలిపారు. సింగరేణిలో ఉద్యోగం నుంచి సస్పెండ్ అయిన జీకే సంపత్‌కుమార్ సీఎండీ బలరాం నాయక్ పై కులంపేరుతో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

యువకుడు అదృశ్యం



విపుల్

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... నార్త్ లాలాగూడలో నివాసముంటున్న విపుల్(22) అనే యువకుడు బీ–టెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 16న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రైనా కూడా ఇంటికి తిరిగిరాకపోవడంతో విపుల్‌కు కుటుంబసభ్యులు ఫోన్ చేయగా ఇంటికి వస్తున్నానని చెప్పాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తెలిసిన వారిని, స్నేహితులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు అతగి సోదరుడు విశాల్ స్థానిక లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాన కూడళ్ల విస్తరణ ద్వారానే ట్రాఫిక్ నియంత్రణ

నార్త్‌జోన్ కన్జర్వేన్సీ కమిటీ నిర్ణయం



సమావేశంలో జీహెచ్ఎంసీ జడ్సీ రవికిరణ్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

సికింద్రాబాద్: ప్రధాన కూడళ్లను విస్తరించడం, అక్కడ నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపడం ద్వారా నగరంలో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించాలని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు నిర్ణయించారు. గురువారం జీహెచ్ఎంసీ నార్త్‌జోన్ కార్యాలయంలో కన్జర్వెన్సీ కమిటీ సమావేశం జరిగింది. జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో సిటీ పోలీస్ (ట్రాఫిక్) డిప్యూటీ కమిషనర్ రాహుల్ హెగ్డే, ఏసీపీలు శంకర్‌రాజు, శ్రీనివాస్, జీహెచ్ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆశాలత, జిటీ ప్లానర్ శ్రీనివాస్, ఐదు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు అంజనేయులు. డాకునాయక్, రామానుజారెడ్డి, మారుతి దివాకర్, జక్రియా సుల్తానా తదితర అధికారులు పాల్గొన్నారు. ఇటీవల సికింద్రాబాద్, బేగంపేట్, మల్కాజిగిరి, అంబర్‌పేట్, ముషీరాబాద్ సర్కిళ్ల పరిధిలో చేపట్టిన ఫుట్‌పాత్‌ల పరిరక్షణ కార్యక్రమం ద్వారా చేకూరుతున్న ప్రయోజనాల గురించి అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ట్రాఫిక్ సమస్యలకు హేతువులుగా మారిన ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తస్వరమే తొలగించేందుకు ఆయా ప్రాంతాల ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం కావాలని అధికారులు ఆదేశించారు. చిలకలగూడ కూడలి, పాటిగడ్డ కూడలి విస్తరణ కోసం ట్రాఫిక్ పోలీసులు సూచించిన విధంగా అభివృద్ధి పనులు చేపట్టి విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించారు. పెండింగ్‌లో ఉన్న కూడళ్ల విస్తరణ, విస్తరించిన కూడళ్లలో విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేసి ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు ఎదురవుతున్న అవరోధాలను తొలగించే పనులు వేగవంతం చేయాలనుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో రహదారులపై గుంతలు, వరదనీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని నిర్ణయించారు. విద్యుత్ తీగలకు అడ్డుగోడలుగా మారుతున్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు ముమ్మరం చేయాలనుకున్నారు.

ఉద్యోగం పేరిట యువతికి టోకరా

సనత్‌నగర్: ఉద్యోగం పేరిట ఓ మహిళను మోసం చేసి డబ్బు తీసుకున్న ఓ సంస్థకు చెందిన సిబ్బందిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన ఎం.ముత్యాలమ్మ ఎస్సార్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. ఉద్యోగ అన్వేషణలో భాగంగా తన వివరాలను జాబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ క్రమంలో లాన్స్ స్టాఫ్ ఇండియా అనే సంస్థ పేరిట ఆన్‌లైన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమెకు మెయిల్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూకు హాజరు కాగా ఆ సంస్థ హెచ్‌ఆర్‌గా చెప్పుకున్న సత్య అనే యువతి మాట్లాడి సర్టిఫికెట్లను పంపమని అడిగింది. ఆ తర్వాత జయ అనే మరో వ్యక్తి ఫోన్ చేసి కొత్త ఉద్యోగం కోసం ఖాతా తెరవాలని, ఇందుకు కొంత డబ్బు కావాలని, అలాగే గేట్‌పాస్ కోసం మరికొంత పంపాలని మొత్తం రూ.69,500లు వసూలు చేశారు. తిరిగి బీమా కోసం డబ్బు పంపాలని అడగడంతో అనుమానం వచ్చిన బాధితురాలు డబ్బు పంపలేదు. దీంతో వారు ఆమెకు తిరస్కరణ లేఖను పంపారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న దీపు గౌతమ్ (ఫైల్)

సికింద్రాబాద్: అప్పుల బాధ భరించలేక ఉత్తరప్రదేశ్ కు చెందిన యువకుడు గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ పండరి వివరాల మేరకు..ఉత్తరప్రదేశ్‌కు చెందిన దీపుగౌతమ్ (26)బాచుపల్లి లో నివాసం ఉంటూ అదే ప్రాంతంలో పెయింటింగ్ వసులు చేసుకునేవాడు. దీపుగౌతమ్ తలకు మించిన అప్పులు చేయడంతో పాటు మద్యానికి కూడా డబ్బు దొరకక పోవడంతో జీవితంపై విరక్తి చెందిన దీపుగౌతమ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు చేరుకున్నాడు. ఒకటవ నెంబర్ ప్లాట్ ఫారం నుండి వేగంగా వస్తున్న గోల్కొండ ఎక్స్ ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీ కి తరలించి బంధువులకు సమాచారం అందించారు.

సిగ్నల్స్ వద్ద సామాజిక సేవ చేయండి

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి కోర్టు ఆదేశం

సనత్‌నగర్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ పలువురికి సామాజిక సేవ చేయాలంటూ కోర్టు తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాలతో ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో పలువురు సోషల్ సర్వీస్ కార్యక్రమం చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడపరాదంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు అవగాహన కలిగించారు. డ్రంకన్ డ్రైవ్ చేయడం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. ఇక నుంచి పగలూ రాత్రీ అని తేడా లేకుండా డ్రంకన్ డ్రైవ్ కొనసాగుతుందని ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు.